సాక్షి
విశాఖపట్నం
ఆదివారం । 2 । ఏప్రిల్ । 2023



ఫుట్‌బాల్ విజేత ఎస్‌డీఎఫ్‌సీ

జిల్లా ఫుట్‌బాల్ వార్షిక లీగ్ విజేతగా శ్రీదుర్గాలమ్మ ఫుట్‌బాల్ క్లబ్(ఎస్‌డీఎఫ్‌సీ) నిలిచింది. 8లో



గజ్జెకట్టిన పట్నం

తెలుగు జానపద నృత్యాలు, సంప్రదాయ వస్త్రధారణతో శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం శోభిల్లింది. 8లో



క్రీడా శిబిరాల పోస్టర్ ఆవిష్కరణ

ఈకోర్స్ వాల్తేర్ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాల పోస్టర్‌ను డీఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి విడుదల చేశారు. 8లో

న్యూస్‌రీల్

రేపటి నుంచి ఒంటిపూట బడులు

విశాఖ విద్య : జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య పరిధిలోని పాఠశాలల్లో సోమవారం నుంచి ఒంటిపూట తరగతులు నిర్వహించనున్నారు. రోజూ ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు పాఠశాలలు పనిచేస్తాయి. 12.30 తరువాత విద్యార్థులకు జగనన్న గోరుముద్ద పెట్టి ఇళ్లకు పంపించాలని విద్యాశాఖ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ విద్యా సంవత్సరంలో ఈ నెల 30 చివరి పనిదినంగా ప్రకటించారు. అయితే 30వ తేదీ ఆదివారం కావటంతో ఆ రోజు నుంచే వేసవి సెలవులుగా పరిగణించాల్సి ఉంటుంది. పదో తరగతి పరీక్ష కేంద్రాలుగా ఉన్న పాఠశాలల్లో పరీక్ష రోజున సెలవు ఉంటుంది. ఆ ఆరు రోజులను ఈ నెల 30లోపు అదనంగా పాఠశాలలను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నెల 20 నుంచి 29 వరకు 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు సమ్మేటివ్-2 పరీక్షలు నిర్వహించనున్నారు.

ఆరుగురు సీఐలకు పోస్టింగ్

దొండపర్తి : నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ పోలీస్‌స్టేషన్లలో అటాచ్‌మెంట్‌లో ఉన్న ఇన్‌స్పెక్టర్లకు అదే స్టేషన్‌లో పోస్టింగ్ కల్పిస్తూ నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆరిలోవ లా అండ్ ఆర్డర్‌కు జి.సోమశేఖర్, కంచరపాలెం లా అండ్ ఆర్డర్‌కు ఎస్.విజయ్‌కుమార్, ఎయిర్‌పోర్ట్ లా అండ్ ఆర్డర్‌కు బి.ఎం.డి.ప్రసాద్, మహారాణిపేట లా అండ్ ఆర్డర్‌కు బి.రమణమూర్తి, ఎంవీపీ లా అండ్ ఆర్డర్‌కు హెచ్.మల్లేశ్వరరావు, ద్వారకా క్రైం సబ్ డివిజన్‌కు టి.ఇమ్మాన్యుయల్ రాజులకు పోస్టింగ్‌లు ఇచ్చారు.

సీపీఎం నాయకుడు సుబ్బారావు మృతి



అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు గొల్లపల్లి సుబ్బారావు (74) అనారోగ్యంతో మృతి చెందారు. నగరంలో కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు భార్య మణి, ఇద్దరు కుమారులున్నారు. సుబ్బారావు మృతి కార్మిక లోకానికితీరని లోటని పలువురు కమ్యూనిస్ట్ నాయకులు పేర్కొన్నారు. గాజువాక సీపీఎం మాజీ కార్యదర్శి, బీహెచ్‌పీవీ మాజీ ఉద్యోగిగా ఉంటూ షీలానగర్‌లో స్థిరనివాసం ఏర్పరుచుకొన్నారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

వైద్య పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో పలు వైద్యులు పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు. కాంట్రాక్ట్ పద్ధతిపై ఏడాది కాలం పనిచేసేందుకు పిడియాట్రిషియన్-05, గైనకాలజిస్టులు- 05, కార్డియాలజిస్ట్-01, జనరల్ మెడిసిన్ 01, మెడికల్ ఆఫీసర్-11 పోస్టులు భర్తీ చేస్తున్నట్లు వెల్లడించారు. స్పెషలిస్టులకు నెలకు రూ.1.10లక్షలు(గ్రామీణ ప్రాంతం), 1.40 లక్షలు(గిరిజన ప్రాంతం), మెడికల్ ఆఫీసర్లకు నెలకు రూ.53,494 పారితోషికం అందజేస్తామన్నారు. స్పెషలిస్టులు ఎంబీబీఎస్, సంబంధిత శాఖలో పీజీ/డిప్లమో, మెడికల్ ఆఫీసర్లు ఎంబీబీఎస్ లేదా ఎంసీఐ గుర్తింపు ఉన్న సమాన హోదా కలిగిన ఉండాలని సూచించారు. ఈనెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అదే రోజు జరిగే ఇంటర్వ్యూకు కూడా హాజరుకావచ్చన్నారు. పూర్తి వివరాలకు https://visakhapatnam.ap.gov.in/ ను సందర్శించవచ్చన్నారు.

పెరిగిన టోల్‌గేట్ చార్జీలు



అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లో గల టోల్‌గేటు ఛార్జీలు రేట్లు పెరిగాయి. పెరిగిన రేట్లు శనివారం నుంచి అమల్లోకి వచ్చాయి. సుమారు 15 నుంచి 20 శాతం వరకు చార్జీలు పెరిగినట్లు టోల్ గేటు యాజమాన్యం తెలిపింది.

‘షిప్ మంత్ర’పై ఫోకస్!

- ప్రచారానికి పది మందితో టీమ్
- బస్టాండ్లలో అవగాహనకు ఆర్టీసీ సన్నద్ధం
- ప్రైవేటు పార్సిల్స్ కంటే 50 శాతం తక్కువ చార్జీలు
- తొలిదశలో రెగ్యులర్ కస్టమర్లు, విద్యార్థులే టార్గెట్



షిప్‌మంత్రపై అధికారులతో మాట్లాడుతున్న ఆర్టీసీ జోన్-1 ఈడీ రవికుమార్

సాక్షి, విశాఖపట్నం: కార్గో సేవల్లో ఆర్టీసీ దూకుడు ప్రదర్శిస్తోంది. ప్రైవేటు పార్సిల్ సంస్థలకు దీటుగా దూసుకువెళ్తోంది. కార్గో సేవలను విస్తృతం చేయడంతో పాటు డోర్ డెలివరీ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి ఇటీవల ఆర్టీసీ యాజమాన్యం ‘షిప్‌మంత్ర’తో ఒప్పందం కుదుర్చుకుంది. తొలుత విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్ నగరాల్లోనే ఈ సదుపాయాన్ని ప్రవేశపెట్టింది. తాజాగా ఈనెల 3వ నుంచి శ్రీకాకుళం, విజయనగరం, రాజమండ్రి ప్రాంతాలకు కూడా ఈ డోర్ డెలివరీ సేవలను విస్తరిస్తోంది. ఇందులోభాగంగా www.shipmantra.com యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా ఇంటి నుంచే ఆన్‌లైన్‌లో పార్సిల్/లగేజీని బుక్ చేసుకునే వీలుంటుంది. అలాగే ఇందుకయ్యే చార్జీని డిజిటల్ పేమెంట్ చేయొచ్చు. షిప్‌మంత్ర సేవలపై ఆర్టీసీ జోన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) సి.రవికుమార్ అధ్యక్షతన విశాఖలో సంబంధిత ఆర్టీసీ అధికారులతో సమావేశమయ్యారు. వారికి షిప్‌మంత్రపై తగు సూచనలు చేశారు.

ప్రత్యేక టీమ్‌తో ప్రచారం

ఆర్టీసీ కొత్తగా అందుబాటులోకి తెచ్చిన షిప్‌మంత్రను విస్తృతంగా ప్రచారం చేయడానికి పది మందితో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందంలోని సభ్యులు షిప్‌మంత్ర ద్వారా అందే సేవలు, వినియోగం, ఇతర ప్రైవేటు పార్సిల్ సంస్థలకంటే ఆర్టీసీ షిప్‌మంత్ర తక్కువ చార్జీలు, సత్వర బట్వాడా వంటి ప్రయోజనాలను వివరించనున్నారు. తొలిరోజు శనివారం విశాఖలోని ద్వారకా బస్‌స్టేషన్ కాంప్లెక్స్, మద్దిలపాలెం బస్‌స్టేషన్లలో ప్రయాణికులకు అవగాహన కల్పించారు. షిప్‌మంత్ర యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రయాణికులతో పాటు ఆర్టీసీ కార్గో రెగ్యులర్ కస్టమర్లు, విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. రానున్న రోజుల్లో మిగిలిన బస్టాండ్లలోనూ షిప్‌మంత్రపై అవగాహన కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు. ఇతర ప్రైవేటు కార్గో/పార్సిల్ సంస్థల కంటే ఆర్టీసీ షిప్‌మంత్ర ద్వారా బుక్ చేసుకునే లగేజీ/పార్సిల్ చార్జీలు 40-50 శాతం వరకు తక్కువగానే ఉంటాయని, ఇది వినియోగదారులకు లాభదాయకమని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. పైగా ప్రైవేటు సంస్థల ద్వారా బుక్ చేసుకున్న సరకు/పార్సిల్ డెలివరీకి రెండు మూడు రోజులు పడుతుంది. అదే ఆర్టీసీ పార్సిల్ సర్వీసు ద్వారా రాష్ట్రంలో ఎక్కడికైనా 24 గంటల్లోనే డెలివరీ చేయగలుగుతామని ఆర్టీసీ విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) అప్పలనాయుడు ‘సాక్షి’కి చెప్పారు. ఆర్టీసీ కొత్తగా ప్రవేశపెట్టిన షిప్‌మంత్ర ద్వారా తక్కువ చార్జీలతోనే పార్సిల్ బుకింగ్, సత్వర డోర్ డెలివరీ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆ బంగ్లాలో ఏం జరుగుతోంది?

- నెల రోజులుగా సీసీ కెమెరాలు బంద్
- ఓ ఐఏఎస్ అధికారి బంగ్లాలో విడ్డూరం

సాక్షి, విశాఖపట్నం: నగరంలోని ఓ ఉన్నతాధికారి బంగ్లా అది.. నిరంతరం భద్రత కోసం సీసీ కెమెరాలు ద్వారా పర్యవేక్షిస్తుంటారు. కానీ నెల రోజులకు పైగా మూడో కన్ను మూసుకుపోయింది. నిరంతర నిఘా ఉండాల్సిన ప్రాంతంలో స్వయంగా ఆ అధికారే సీసీ కెమెరాలు బంద్ చేయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంతకీ.. ఆ బంగ్లాలో ఏం జరుగుతోంది?

సిరిపురం, బీచ్‌రోడ్డు సమీపంలో ప్రభుత్వ అధికారుల కోసం బంగ్లాలున్నాయి. ఇందులో ఓ ఐఏఎస్ అధికారికి కేటాయించిన బంగ్లా కూడా ఉంది. ఈ బంగ్లా వద్ద నిరంతర నిఘా కోసం 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే నెల రోజులకు పైగా ఈ సీసీ కెమెరాలు పనిచేయడం మానేశాయి. ఆ విభాగానికి చెందిన భద్రతా సిబ్బంది ఈ విషయం తెలుసుకుని కంగారు పడ్డారు. అధికారికి తెలిస్తే తమ ఉద్యోగాలు ఊడిపోతాయని భయపడ్డారు. కానీ కొన్ని రోజుల తర్వాత తెలిసిన విషయమేంటంటే.. ఆ ఉన్నతాధికారే సీసీ కెమెరాల కనెక్షన్లను దగ్గరుండి మరీ తొలగించారని సమాచారం. ఈ విషయం తెలుసుకున్న భద్రతా సిబ్బంది ఆశ్చర్యపోయారు. ఈ విషయాన్ని ఆ అధికారి దృష్టికి తీసుకెళ్లగా అదంతా తాను చూసుకుంటానంటూ వారిని పంపించేశారు. అయితే ఆ ఐఏఎస్ అధికారి ఎంతో ముఖ్యమైన సీసీ కెమెరాలను ఎందుకు తప్పించారన్న అంశంపై ఆ విభాగంలోని ఇతర అధికారులు, ఉద్యోగులు తలలు పట్టుకుంటున్నారు. మరోవైపు నిఘా నేత్రం తప్పించడంపై ఆ అధికారి కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. త్వరలో ఇక్కడి నుంచి వెళ్లిపోతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారని విమర్శిస్తున్నారు. కొన్ని అనధికార వ్యవహారాలను చక్కబెట్టే క్రమంలో ఎవరికీ ఏ విధమైన అనుమానం రాకుండా ఉండేందుకు ఈ తరహాలో వ్యవహరించారని ఆరోపిస్తున్నారు. ఆ ఉన్నతాధికారి విజయవాడలో ఓ ఇల్లు కొనుక్కున్నారని.. దానికి సంబంధించి రూ.కోట్ల విలువైన ఫర్నిచర్, ఇతర సామగ్రి ఇక్కడే కొనుగోలు చేసి వాటిని భద్రపరిచేందుకు బంగ్లాలో ఉన్న గదులను వినియోగించుకున్నారన్నది సమాచారం. ఉన్నతాధికారి బంగ్లాలో నెల రోజులకు పైగా సీసీ కెమెరాలు పని చేయని నేపథ్యంలో ఏదైనా అనుకోని సంఘటన జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని.. ఇది చాలా రిస్క్‌తో కూడిన అంశమని అంతా విమర్శిస్తున్నారు.

జీవీఎంసీ పన్నుల వసూళ్లు రూ.422.50 కోట్లు



దాబాగార్డెన్స్: జీవీఎంసీ పరిధిలో పన్ను బకాయిలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన వడ్డీ రాయితీ గడువు శుక్రవారం అర్ధరాత్రితో ముగిసింది. దీంతో రికార్డు స్థాయిలో పన్నులు వసూళ్లయ్యాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.320 కోట్లు పన్నుల వసూళ్లు కాగా.. మరో రూ.55కోట్ల లక్ష్యంతో మొత్తంగా రూ.375 కోట్ల వసూళ్లకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆస్తి పన్నుపై వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో అనుకున్న లక్ష్యానికి మించి అన్ని జోన్ల పరిధి నుంచి రూ.422.50 కోట్లు వసూలైంది. అంటే లక్ష్యానికి మించి రూ.47 కోట్లకు పైబడి వసూళ్లయ్యాయి. విశాఖపట్నం పరిధిలో 2021 ఏప్రిల్ ఒకటి నుంచి 2022 మార్చి వరకు 309.84 కోట్లు రాగా, 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31వరకు రూ.399.97 కోట్లు వచ్చాయి. అనకాపల్లి జోన్‌కి సంబంధించి 2021 ఏప్రిల్ ఒకటి నుంచి 2022 మార్చి వరకు రూ.8.85 కోట్ల ఆదాయం వస్తే, 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31 వరకు రూ.12.37కోట్లు, భీమిలి జోన్ నుంచి 2021 ఏప్రిల్ ఒకటి 2022 మార్చి వరకు 5.49 కోట్లు వస్తే, 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి వరకు రూ.9.60 కోట్ల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

మహానేత ఆలోచనలతో ఎదిగాను

రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి మేరుగ నాగార్జున



మాట్లాడుతున్న మంత్రి మేరుగ నాగార్జున

దాబాగార్డెన్స్: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలోచనలు.. తన ఎదుగుదలకు ఉపయోగపడ్డాయని రాష్ట్ర సాంఘిక శాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి బాటలో నడుస్తూ అన్ని వర్గాలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నారని, ఇచ్చిన మాటకు కట్టుబడి నెరవేర్చడం తనకు ఎంతో స్ఫూర్తినిస్తోందన్నారు. డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు బైపా అరుణ్‌కుమార్, న్యాయవాది ఫషియుద్దీన్ అధ్యక్షతన శనివారం మంత్రి ఆత్మీయ అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తనకు విశాఖతో ఎంతో అనుబంధం ఉందన్నారు. ఏయూలో రీసెర్చ్ స్కాలర్‌గా, పీహెచ్‌డీ పూర్తిచేసి, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేసి.. ఇక్కడి నుంచే ఎదిగానన్నారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా పలు పర్యాయాలు విధులు నిర్వర్తించానని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తనపై నమ్మకంతో మంత్రి పదవి ఇచ్చారని, అవసరం అని వచ్చిన వారికి సాయం చేయాలన్నదే నా లక్ష్యమన్నారు. బైపా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సామాజిక సేవ చేసి.. క్రియాశీలక రాజకీయాల్లో చురుకుగా పని చేస్తున్న వ్యక్తి మంత్రి నాగార్జున అని కొనియాడారు. ఈ సందర్భంగా ఏయూ ప్రొఫెసర్లు, సిబ్బంది, రీసెర్చ్ స్కాలర్లు, న్యాయవాదులు, మేధావులు ఆయన్ని ఘనంగా సత్కరించారు. వాగుపల్లి చిన్నారావు, డాక్టర్ తిగురుపల్లి బోసుబాబు, విశాఖ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, ప్రధాన కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, బూత్‌టక్కర్, స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ఫర్ ఎక్సైజ్ తాళ్ల వెంకటరమణ, కార్పొరేటర్ కేవీఎన్ శశికళ, కదిరి రాము, గుడిపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడే అప్పన్న కల్యాణోత్సవం

- సాయంత్రం 6.30 గంటల నుంచి ఎదురుసన్నాహోత్సవం
- రాత్రి 8 గంటల నుంచి రథోత్సవం
- రాత్రి 9.30 గంటల నుంచి వార్షిక కల్యాణోత్సవం



విద్యుద్దీపకాంతులతో రాజగోపురం

సింహాచలం: చైత్ర శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం వైభవంగా జరగనుంది. సింహగిరిపై ఉన్న నృసింహ మండపంలో ఈ ఉత్సవాన్ని నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు భారీ ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 3 గంటలకు నీలాద్రిగుమ్మం వద్ద అర్చకులు, ముత్తైదువులు పసుపు కొమ్ములను దంచి కొట్నాలు ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం ధ్వజారోహణం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 నుంచి 7.30 గంటల వరకు స్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని బంగారు పల్లకీలోను, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ముత్యాల పల్లకీలో ఉంచి మాడ వీధుల్లో ఎదురు సన్నాహోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 8 నుంచి 9 గంటల వరకు సింహగిరి మాడ వీధుల్లో రథోత్సవాన్ని నిర్వహిస్తారు. రథోత్సవం అనంతరం ఉత్సవమూర్తులను నృసింహ మండపంలోకి తీసుకెళ్లి అక్కడ భారీ ఎత్తున ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై వేంజేపచేస్తారు. రాత్రి 9.30 గంటల నుంచి వార్షిక కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు.

విశేషంగా ఏర్పాట్లు

- రథోత్సవం, కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో పలు శాఖల సమన్వయంతో ఉత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.
- నృసింహ మండపంలో భారీ ఎత్తున కల్యాణ వేదికను ఏర్పాటు చేశారు. పలు రకాల పుష్పాలు, భారీ విద్యుద్దీపకాంతులతో కల్యాణవేదికను అలంకరిస్తున్నారు.
- నృసింహ మండపంలో ఉన్న గార్డెన్‌లో కూర్చుని కల్యాణాన్ని తిలకించే విధంగా సాధారణ భక్తులకు మూడు గేలరీలు, వీఐపీలకు ఒక గ్యాలరీ ఏర్పాటు చేశారు.
- మొత్తం ఐదు పెద్ద స్క్రీన్‌లు ఏర్పాటు చేసి అందులో కూడా భక్తులు కల్యాణాన్ని తిలకించే విధంగా ఏర్పాటు చేశారు.
- 10 వేల చిన్న లడ్డులను, పదివేల ముత్యాల తలంబ్రాల ప్యాకెట్లను ప్రసాదంగా అందించనున్నారు.
- మధ్యాహ్నం అన్నదాన భవనంలో 5 వేల మందికి, రాత్రి 5 వేల మందికి అన్నప్రసాదాన్ని అందించనున్నారు.
- రెగ్యులర్ సీసీ కెమెరాలతో పాటు అదనంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు.
- అడవివరం ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో రెండు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు.
- రాజగోపురం, ఆలయ ప్రాంగణాలు, నృసింహ మండపం, మాడ వీధిలు, కాటేజీలకు విద్యుద్దీపాలతో అలంకరించారు. ఘాట్‌రోడ్డులోను, కొండదిగువ ఘాట్‌రోడ్డు ముఖద్వారం, కొండదిగువ బస్టాండ్‌ల వద్ద విద్యుద్దీపాలంకరణ చేశారు.
- రెగ్యులర్ బస్సులతో పాటు 6 ప్రత్యేక బస్సులను సాయంత్రం 4 గంటల నుంచి నడపనున్నట్లు సింహాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. అలాగే దేవస్థానం బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.
- 130 మందితో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

మంగళసూత్రాలు అందజేత



శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణ మహోత్సవం సందర్భంగా 138.600 గ్రాముల బంగారు మంగళసూత్రాలను నగరానికి చెందిన ఎస్.ఎల్.వి.నాంచారయ్య, లక్ష్మీ దుర్గేశ్వరి, విభవ్ శ్రీకర్, సూర్యప్రకాష్, రాజ్యలక్ష్మి, శౌర్య అనే దాతలు అందజేశారు. ఆదివారం జరిగే వార్షిక కల్యాణోత్సవంలో మంగళసూత్రాలను అమ్మవార్లకు సమర్పించనున్నారు.

వేసవి క్రీడా శిబిరాల పోస్టర్ విడుదల

విశాఖ స్పోర్ట్స్: ఈకోర్స్టా వాల్తేర్ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాల పోస్టర్‌ను డీఆర్‌ఎం అనూప్‌కుమార్ సత్పతి శనివారం విడుదల చేశారు. ఈనెల 3వ తేదీ నుంచి మే వరకు పలు క్రీడాంశాల్లో శిబిరాల్ని నిర్వహించనున్నారు. 5 ఏళ్ల నుంచి 15 ఏళ్ల చిన్నారులకు వివిధ క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లను రైల్వేస్టేడియంలో నమోదు చేసుకోవచ్చని డీఆర్‌ఎం తెలిపారు.

ప్రకృతిని ఆస్వాదిద్దాం రండి!

- జీవరాశుల జీవశైలిని వివరిస్తున్న వైల్డ్ ఎడ్
- వారంతంలో ప్రకృతి నడక ద్వారా అవగాహన

బీచ్‌రోడ్డు: మనలో చాలా మంది ప్రకృతి ప్రేమికులు ఉంటారు. ప్రకృతిలోని జీవరాసుల గురించి తెలుసుకోవాలని, వాటితో కాసేపు సమయం వెచ్చించాలని అనుకుంటారు. ఇందుకు ఎవరిని సంప్రదించాలి? ఎవరితో వెళ్లాలి? అనే సంశయంలో ఉంటారు. అటువంటి వారి కోసం మేమున్నామని అంటున్నారు వైల్డ్‌ఎడ్(వైల్డ్ ఎడ్యుకేషన్) సంస్థ సభ్యులు. ప్రకృతి నడక అనే కార్యక్రమం ద్వారా అడవులు, కొండలు, తీరం వెంబడి నడిపిస్తూ.. జీవరాశుల గురించి అవగాహన కల్పించడం ఈ సంస్థ లక్ష్యం. ప్రతీ వారంతంలో ప్రకృతి నడక నిర్వహిస్తున్న ఈ సంస్థ.. మేలో సమ్మర్ క్యాంప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

2022లో ప్రారంభం: నేటి జీవన విధానంలో మానవుడికి ప్రకృతికి మధ్య సంబంధం దూరమవుతోంది. ప్రకృతిని మానవుడికి దగ్గర చేయాలనే ఉద్దేశంతో నగరానికి చెందిన విమల్ రాజు తన స్నేహితులు ప్రణవ్, సౌమ్య, సుమంత్‌లతో కలిసి వైల్డ్‌ఎడ్‌ను 2022 ఏప్రిల్‌లో ప్రారంభించారు. చిన్నారులు, పెద్దలకు ప్రకృతిలో దాగి ఉన్న అందమైన జీవన శైలిని వివరిస్తున్నారు.

మెరైన్ వాక్ : తీరంలో అలల తీవ్రత తక్కువ ఉన్నప్పుడు రాళ్ల మధ్య ఉండే జలరాశుల జీవన విధానం, సముద్ర మొక్కల కోసం తెలుసుకునేందుకు మెరైన్ వాక్‌ను ఈ సంస్థ చేపడుతోంది. ఆర్.కె. బీచ్ నుంచి భీమిలి బీచ్ వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. రాత్రి సమయంలో అడవుల్లో జంతువుల జీవన విధానం తెలియజేస్తుంది.

ఈ నెలలో కార్యక్రమాలివీ..: ఈ నెల 2న వైఎంసీఏ ఎదురుగా ఇంటర్‌టైడల్ వాక్, 8న సింహాచలంపై ఇన్సెక్ట్ వాక్, 9న కందులపాలెం(పాడేరు)లో అడ్వెంచర్ హైక్, 15న హార్బర్ వాక్, 16న సింహాచలంపై ఇన్సెక్ట్ వాక్, 22న వీఎంఆర్డీఏ పార్క్‌లో నేచర్ జర్నలింగ్, 23న తెన్నేటిపార్క్‌లో ఇంటర్‌టైడల్ వాక్ ఉంటుంది.

మేలో సమ్మర్ క్యాంపు

ప్రకృతితో మానవుడికి అనుబంధం పెంచేందుకు వైల్డ్ ఎడ్ సంస్థను ఏర్పాటు చేశాం. నేచర్ వాక్‌కు వచ్చే వారు పలు జీవరాశుల జీవన విధానం చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తుంటారు. మేము ఎక్కువగా సింహాచలం కొండ మీద నేచర్ వాక్ చేస్తుంటాం. మేలో సమ్మర్ క్యాంపు ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు 73308 80274ను సంప్రదించవచ్చు.

– విమల్ రాజ్, వైల్డ్ ఎడ్ వ్యవస్థాపకుడు

ఫుట్‌బాల్ విజేత ఎస్‌డీఎఫ్‌సీ



రన్నరప్ సాధించిన ఎస్‌పీఎంఎఫ్‌సీ జట్టు

విశాఖ స్పోర్ట్స్: జిల్లా ఫుట్‌బాల్ వార్షిక లీగ్ విజేతగా శ్రీదుర్గాలమ్మ ఫుట్‌బాల్ క్లబ్(ఎస్‌డీఎఫ్‌సీ) నిలిచింది. రన్నరప్‌ను శ్రీపోలమాంబ ఫుట్‌బాల్ క్లబ్ (ఎస్ పీఎం ఎఫ్‌సీ) సాధించింది. విశాఖ జిల్లా ఫుట్‌బాల్ ఎలియెన్స్ వె ల్ఫేర్ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ స్టేడియంలో శనివారం జరిగిన టైటిల్ పోరులో ఇరు జట్లు నిర్ణీత సమయానికి గోల్‌లెస్ గానే ముగించగా విజేతను నిర్ణయించేందుకు షూటౌట్ నిర్వహించారు. ఎస్‌డీఎఫ్‌సీ 5-3తో విజయం సాధించింది. మిదిలాపురి, స్టార్ ఫోర్స్ జట్లు సెమీస్‌లో పరాజయం పాలై సెకండ్ రన్నరప్‌గా నిలిచాయి. సంఘం చైర్మన్ డాక్టర్ ఎస్.వి.ఆదినారాయణ విజేతలకు ట్రోఫీలందించారు. ఫ్రాన్స్ జట్టు తరఫున వరల్డ్‌కప్ ఫుట్‌బాల్ ఆడిన వికాష్ దోరస్వా అతిథిగా పాల్గొన్నారు.

వీఎంఆర్డీఏ కార్యదర్శిగా రంగయ్య బాధ్యతల స్వీకరణ



మల్లికార్జునకు పుష్పగుచ్ఛం ఇస్తున్న రంగయ్య

దొండపర్తి: వీఎంఆర్డీఏ కార్యదర్శిగా సిహెచ్.రంగయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన వేణుగోపాల్‌ను ప్రభుత్వం బదిలీ చేసిన విదితమే. ఆయన స్థానంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా పనిచేసిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రంగయ్య నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మెట్రోపాలిటన్ కమిషనర్, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జునను మర్యాదపూర్వకంగా కలిశారు.

గజ్జె కట్టిన పట్నం

ఉర్రూతలూగించిన 'నాట్స్' జానపద పండగ



పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్ల గోపాలరావును సత్కరిస్తున్న నిర్వాహకులు

మద్దిలపాలెం: తెలుగు జానపద నృత్యాలు, సంప్రదాయ వస్త్రధారణతో శనివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం శోభిల్లింది. ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాట్స్) ఆధ్వర్యంలో గౌతు లచ్చన్న బలహీన వర్గాల సంస్థ(గ్లో), శ్రీ మాత కళా పీఠం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, అభ్యుదయ కవి డాక్టర్ పెదవీర్రాజు, రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి. రమణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా పెదవీర్రాజు మాట్లాడుతూ భాషే రమ్యం.. సేవే గమ్యం అనే నినాదంతో జన్మభూమికి సేవ చేయడం పూర్వజన్మ సుకృతం అన్నారు. జాన పదం మన జీవనంలో భాగమని.. అలాంటి జానపదాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పద్యనాటక రంగంలో పద్మశ్రీ పురస్కారం పొందిన యడ్ల గోపాలరావు, తెలుగు భాషా కోవిదుడు మీగడ రామలింగస్వామిని సన్మానించారు. గాయకుడు అసిరయ్య గళం నుంచి జానపదాలు జాలువారుతుంటే.. కళాకారులు లయబద్ధంగా నృత్యాలు చేసి అందరినీ మంత్రముగ్ధులను చేశారు. నాదీ నక్కిలీసు గొలుసు పాటను పాడుతుంటే.. ఉర్రూతలూగిపోయారు. అనంతరం బాలగాయనీ గాయకులు చేసి సంగీత విభావరి అందరినీ ఆకట్టుకుంది. బేబి కుందన శివ నృత్యం చేసి అందరి దృష్టిని ఆకర్షించింది. రఘు బృందం తెలుగు జానపదాలతో అలరించారు. గ్లో సంస్థ కార్యదర్శి యార్లగడ్డ వెంకన్న, శ్రీమాత సంస్థ అధినేతలు బి.ఎస్.మూర్తి, పల్లి నాగభూషణరావు, నాట్స్ అధ్యక్షుడు బాబుసూతి, నాట్స్ సమన్వయకర్త శ్రీధర్ అప్పసాని, రాజశేఖర్ అల్లాడ తదితరులు పాల్గొన్నారు.

నాసా కాంటెస్ట్‌కు నారాయణ విద్యార్థులు



విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

విశాఖ విద్య: నాసా ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన పోటీలో విశాఖ నారాయణ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 28 వేల మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో కూర్మన్నపాలెం, ఎన్ఏడీ నారాయణ పాఠశాలలకు చెందిన విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు ఎంపికైనట్లు సంస్థ ఏజీఎం జి.రాజ్ కుమార్ తెలిపారు. శనివారం నారాయణ విద్యా సంస్థల ప్రధాన కార్యాలయంలో విద్యార్థులను స్టేట్ కో-ఆర్డినేటర్ రాం నరేష్, ఒలింపియాడ్ స్టేట్ కో-ఆర్డినేటర్ శివ ప్రతాప్, ఆర్ఐ సత్కరించారు.